# ప్రజా మైత్రి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 297  పేజీలు : 04  వెల రూ. 2  మంగళవారం  02 - 06 - 2026




బీజేపీకి ఏం చేశావ్?... ఈటల రాజేందర్‌ను ప్రశ్నిస్తూ హైదరాబాద్‌లో పోస్టర్లు

### కొత్త నాయకత్వం కోసం

## కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

- యువతకు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు!
- సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ కొత్త కార్యక్రమం
- రాజకీయ నేపథ్యం లేని యువతకు సువర్ణావకాశమన్న మహేశ్ గౌడ్
- టాలెంట్ ఉన్న వారిని ఎంపిక చేస్తామన్న పీసీసీ చీఫ్



**హైదరాబాద్ :** రాజకీయాల్లోకి సమర్థులైన, చదువుకున్న యువతను ఆకర్షించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ తరఫున వినూత్నమైన 'టాలెంట్ హంట్' ప్రోగ్రామ్‌ను అధికారికంగా ప్రకటించారు. ప్రజా జీవితంలోకి రావాలనుకునే ప్రతిభావంతులైన యువతీ యువకులకు కాంగ్రెస్ పార్టీ ఒక సువర్ణావకాశాన్ని కల్పిస్తోందని, దేశ నిర్మాణంలో యువత ప్రధాన పాత్ర పోషించాలనే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనల నుంచే ఈ కార్యక్రమం రూపుదిద్దుకుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇది సాధారణ పార్టీ చేరికల లాంటి కార్యక్రమం కాదని, సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న ప్రతి ఒక్కరినీ వారి రాజకీయ నేపథ్యంతో సంబంధం లేకుండా ఆహ్వానిస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ టాలెంట్ హంట్ ద్వారా పార్టీ అధికారిక ప్రతినిధులను పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో ఎంపిక చేయనున్నారు. జాతీయ, రాష్ట్ర రాజకీయ వ్యవహారాలపై బలమైన అవగాహన ఉండటం, లౌకికవాదం పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉండటం, సామాజిక సేవపై నిజమైన ఆసక్తితో పాటు ప్రజలతో సమర్థవంతంగా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారిని ఈ ప్రక్రియ - మిగతా 2 లో

### నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

## నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

- ప్రతి నెలా 2, 3 నోటిఫికేషన్లు ఇస్తామన్న టీజీపీఎస్సీ ఛైర్మన్
- 3,800 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతిచ్చిందని వెల్లడి
- కంప్యూటర్ బేస్డ్ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని అభ్యర్థులకు సూచన

**హైదరాబాద్ :** నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రకటన - మిగతా 2 లో

## పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్

- అనుమతి నిరాకరించిన పోలీసులు
- హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ
- జూన్ 2న ఆవిర్భావ వేడుకల దృష్ట్యా భద్రతా కారణాలు చూపిన పోలీసులు
- 'జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో సభకు ప్రణాళిక
- ఈ సభపై తెలంగాణలో కొనసాగుతున్న రాజకీయ చర్చ



**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జనసేన పార్టీ రేపు నిర్వహించ తలపెట్టిన నవనిర్మాణ సభకు సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో 'జనసేన సాధక్' (యాక్టివ్ సభ్యులు) సమావేశం నిర్వహించాలనుకున్నారు. సుమారు 2,000 మంది పార్టీ కార్యకర్తలు హాజరవుతారని అంచనా వేసిన ఈ సమావేశానికి అనుమతిని తిరస్కరిస్తున్నట్లు సెరిలింగంపల్లి జోన్ డీసీపీ కార్యాలయం సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతల సమస్యలు, స్థానిక ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తమ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. - మిగతా 2 లో

### దేశంలో జల వనరుల నిర్వహణ కోసం

## ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్
- దేశంలో కొత్త జల పరిశోధన కార్యక్రమాలకు నాంది
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర జలశక్తి శాఖ
- అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిన ఇరువర్గాలు
- జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి




**ఢిల్లీ :** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో నీటి వనరుల నిర్వహణ కోసం శాటిలైట్ టెక్నాలజీ, అంతరిక్ష ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఈ అగ్రిమెంట్ చేసుకుంది. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవగాహన ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి. డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నీటి భద్రత చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. నీటికి సంబంధించిన సవాళ్లను సాంకేతికత, ఆవిష్కరణలు, సంప్రదాయ జ్ఞానం, ప్రజా భాగస్వామ్యం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అనేక పరిశోధనా అధ్యయనాలకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇందులో 113 ప్రత్యక్ష ప్రాయోజిత ప్రాజెక్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇవి జల రంగంలో ఆచరణాత్మక - మిగతా 2 లో

### ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై

## అమెరికా భీకరదాడులు

- కువైట్ గగనతలంలోకి వచ్చిన క్షిపణులను అడ్డుకున్న ఎయిర్ డిఫెన్స్
- ఇరు దేశాల దాడులతో 2 శాతం పెరిగిన చమురు ధరలు
- భూగర్భ క్షిపణి టన్నెళ్లను వేగంగా పునరుద్ధరిస్తున్న ఇరాన్



**ఢిల్లీ :** మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ పొడిగింపు కోసం దౌత్య ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేడెక్కాయి. అమెరికా, ఇరాన్ బలగాలు గత వారాంతంలో డ్రోన్లు, క్షిపణులతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఇరాన్ దూకుడుకు ప్రతిగా 'ఆత్మరక్షణ దాడులు' జరిపామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించగా, ఇది తమపై జరిగిన దాడికి ప్రతీకార చర్యేనని ఇరాన్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నిఘా పెట్టిన తమ ఎమ్‌క్యూ-1 డ్రోన్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా ఆరోపించింది. దీనికి ప్రతిగా, అమెరికా ఫైటర్ జెట్లు దక్షిణ ఇరాన్‌లోని గోరుక్ ప్రాంతం, క్విష్మ్ ద్వీపంలోని ఇరాన్ రాడార్ వ్యవస్థలు, డ్రోన్ కంట్రోల్ కేంద్రాలపై బాంబుల వర్షం కురిపించినట్లు సెంట్‌కామ్ తెలిపింది. ఈ ఆపరేషన్‌లో ఇరాన్‌కు - మిగతా 2 లో




## చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు

- కాకినాడ జిల్లాలో కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు
- పోలరపు సింహాచలం అనే కార్మికుడికి స్వయంగా పింఛను అందజేత
- కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం
- గీత కార్మికుల కష్టాలు తెలుసుకుని తాటికల్లు రుచిచూసిన సీఎం

## యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

- రూ.30 లక్షల కోట్లకు చేరువైన లావాదేవీల మొత్తం విలువ
- గత ఏడాదితో పోలిస్తే 24 శాతం పెరిగిన లావాదేవీల సంఖ్య
- 8కి పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చిన యూపీఐ సేవలు




## ప్రజానాడి




### మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో

## ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ



- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం
- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి - మిగతా 2 లో

### దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే

## అభివృద్ధి, సంక్షేమం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలే పనిగా పెట్టుకున్నారని మండిపాటు
- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి
- ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీచేస్తే ఓర్వలేకపోయిందన్న సీఎం



**అమరావతి :** 'గతంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు నెలల వరకు ఇస్తున్నాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కుటుంబానికి దాదాపు 3, 4 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. మహిళలకు 33% సీట్లు, ఉచితంగా 3 సిలిండర్లు: ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించి రాజకీయంగా ఎదిగేలా చేసేలా కృషి - మిగతా 2 లో

# సంపాదకీయం

## కాలాతీత బాల్యం



'టామ్.' జవాబు లేదు. 'ఒరేయ్ టామ్.' పోలీ పెద్దమ్మ పిలుపునకు ఇప్పుడు ప్రపంచం నలుమూలలా ఓ అని వినబడుతుంది. టామ్ అమెరికాలో మాత్రమే లేడుగా! వాడు ఆఫ్రికాలోనూ ఉన్నాడు, అనకాపల్లిలోనూ ఉంటాడు. అల్లరి, సాహసం కలగలిసిన ప్రతి పిల్లాడూ టామే! 1876 జూన్ 9న 'పుట్టిన' టామ్ సాయర్‌కు ఇప్పుడు 150 ఏళ్లు! కానీ ఆ తుంటరికి వయసనేది అయిపోతుందా? టామ్ సదాబాలుడు, సరదా బాలుడు; పోలీ పెద్దమ్మనే కాదు, సకల ప్రపంచాన్ని తన అల్లరి చేష్టలతో ఏలిన కౌబాలుడు. 'ది అడ్వెంచర్స్ ఆఫ్ టామ్ సాయర్' నవలను మార్క్ ట్వెయిన్ కేవలం పిల్లల కోసమే రాయలేదు. 'పెద్దవాళ్లు తమ చిన్నతనంలో తాము ఎలా ఉండేవారో, తమ ఆలోచనలు ఎలా ఉండేవో, తాము ఎలా మాట్లాడేవారో, చిత్రమైన సన్నివేశాల్లో ఎలా చిక్కుకునేవారో ఆహ్లాదకరంగా వారికి జ్ఞాపకం' చేసిందా నవల. ప్రపంచ సాహిత్య యవనికపై ఒక చిలిపి బాలుడి సాహసాలు ఇంతటి సుదీర్ఘ కాలం సజీవంగా ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఇంటి గోడకు సున్నం వేయడాన్ని కూడా ఒక కళగా మార్చి, ఇతరులతో పని చేయించుకునే తెలివితేటలున్న టామ్ నేటి మేనేజ్‌మెంట్ గురువులకు ఆది గురువు. ఈ నవల రాకముందు, అమెరికన్ సాహిత్యం ఎక్కువగా యూరోపియన్ శైలిని అనుకరిస్తూ, నీతి సూత్రాలతో నిండి ఉండేది. కానీ ట్వెయిన్ అమెరికన్ మాండలికాన్ని, సామాన్యుల భాషను సాహిత్య గౌరవ పీఠంపై కూర్చో బెట్టాడు. 'ఆధునిక అమెరికన్ సాహిత్యం అంతా మార్క్ ట్వెయిన్ రాసిన ఒకే ఒక్క పుస్తకం నుండి పుట్టింది' అని 'ది అడ్వెంచర్స్ ఆఫ్ హకల్‌బెరీ ఫిన్' (1884) నవలను కొనియాడాడు ఎర్నెస్ట్ హెమింగ్వే. ఈ నవల టామ్ సాయర్‌కు పొడిగింపు అన్నది గుర్తుంచుకుంటే దాని బీజాలు మొదటే ఉన్నాయన్నది అర్థమవుతుంది.కొన్ని కథలు రాసినా ట్వెయిన్‌కు ఇది తొలి నవల. మిసిసిపీ నది తీరాన ఉన్న హానిబాల్ గ్రామంలో గడిపిన తన సొంత బాల్య స్మృతుల నుంచే ట్వెయిన్ ఈ కథను అల్లుకున్నాడు. తనకు తెలిసిన ముగ్గురు అల్లరి పిల్లల లక్షణాలను కలిపి 'టామ్'ను సృష్టించాడంటారు. పేరును మాత్రం లోకల్ హీరో అయిన ఒక ఫైర్‌ఫైటర్ మీదుగా స్వీకరించాడు. ట్వెయిన్‌కు అతడు స్నేహితుడు కూడా. ఇద్దరూ కలిసి సాయంత్రాలు షికార్లు కొట్టేవాళ్లు. అందరికీ ఇష్టమైన హకల్‌బెరీ ఫిన్ పాత్రనేమో తన బాల్యమిత్రుడు టామ్ బ్లాంకెరీ షిప్ ఆధారంగా రూపొందించాడు. ట్వెయిన్ చుట్టూ ఎందరు టాములో! సిడ్ సాయర్, బెకీ థాచర్, జడ్జ్ థాచర్, జో హార్పర్, విడో డగ్లస్, ఇంజన్ జో లాంటి పాత్రలు కూడా మరిచిపోలేనివి. సినిమాలుగా, టీవీ ప్రోగ్రాములుగా, మ్యూజి కల్సుగా అలరించిన టామ్ సాయర్, టైప్‌రైటర్ మీద రాసిన తొలి నవల అని ప్రచారంలో ఉంది. కానీ అది నిజానికి 'లైఫ్ ఆన్ ద మిసిసిపీ' (1883) అని మరోమాట! ఇదీ మార్క్ ట్వెయిన్‌దే కావడం గమనార్హం.పిల్లలు కేవలం మంచివాళ్లు లేదా చెడ్డవాళ్లు కాదు; వాళ్లు అల్లరి, భయం,సాహసం కలగలిసిన వాళ్లని ప్రపంచానికి చాటి చెప్పాడు ట్వెయిన్. ప్రకృతితో మమేకమవ్వడం, అన్వేషించడం నేటి పిల్లలు కోల్పోతున్న సహజ లక్షణాలు. చీకటి గుహల్లో నిధుల కోసం వెతికిన టామ్ మనకు ఇదే గుర్తు చేస్తాడు. నేటి డిజిటల్ యుగంలో, స్మార్ట్‌ఫోన్లకు బందీలైపోతున్న బాల్యానికి టామ్ సాయర్ ఒక తాళంచెవి. వందల ఏళ్లు గడిచినా, సమాజం ఎంత ఆధునీకరించబడినా మనుషుల్లోని అమాయ కత్వం, సాహస ప్రవృత్తి మారవు. అందుకే 'టామ్ సాయర్' కేవలం ఒక పుస్తకం కాదు, అది ప్రతి ఒక్కరి లోపల దాగి ఉన్న బాల్యానికి నిలువుటద్దం. ఈ 150వ వేడుకల సందర్భంగా మనలోని ఆ చిలిపి టామ్ సాయర్‌ను ఒకసారి నిద్రలేపుదాం! ఈ నవలను నండూరి రామమోహనరావు (1927–-2011) టామ్ మన పక్కింటి పిల్లాడే అన్నంత హాయిగా తెలుగులోకి అనువదించాడు. రచయిత నామిని తన కొడుక్కు టామ్ సాయర్ అని పేరు పెట్టుకున్నాడు. టామ్ ఎంతటి తెలుగువాడో చెప్పడానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు. ఈ తిరుపతి టామ్ రచయితగా మారడం ఆ టామ్‌ను కన్నమార్క్ ట్వెయిన్‌కు తగిన నివాళి.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

**మొదటిపేజీ తరువాయి -** దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు.లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్‌ను ఐటీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ఎయిర్‌ట్రంక్‌ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు.లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్‌ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

## పన్నుల ఎగవేతదారులపై పవన్ కల్యాణ్ ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి -** పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశి ంచారు.పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ రంగాల నుంచి పేరుకుపోయిన పన్ను బకాయిలపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య పౌరులు తమ పన్నులను క్రమబద్ధంగా చెల్లిస్తున్నప్పుడు.. పెద్ద పెద్ద పరిశ్రమలు, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు తమ బాధ్యతలను ఎందుకు విస్మరిస్తున్నాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. "సాధారణ ప్రజలు ఎంతో నిజాయతీగా పన్నులు కడుతున్నారు. మరి పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలు పంచాయతీలకు చెల్లింపులు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నాయి? ఎందుకు ఎగవేస్తున్నాయి?" అని పవన్ నిలదీశారు.పన్నుల రికవరీ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఉపముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదరు సంస్థల నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని పన్నులను పూర్తిగా రికవరీ చేయడానికి కఠినమైన విధానాన్ని అవలంబించాలని అధికారులను ఆదేశించారు. వసూళ్ల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించని డిఫాల్టర్ పరిశ్రమలు, విద్యాసంస్థలపై తక్షణమే అవసరమైన చట్టపరమైన చర్యలను ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## ఇరాన్ రాడార్లు.. డ్రోన్ వ్యవస్థపై అమెరికా భీకరదాడులు

**మొదటిపేజీ తరువాయి -** చెందిన రెండు సూసైడ్ డ్రోన్లను కూడా ధ్వంసం చేశామని, తమ సైనికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది.అమెరికా దాడులకు ప్రతీకారంగా, సరిక్ ద్వీపంపై దాడిలో పాల్గొన్న ఒక అమెరికా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు, తమ గగనతలంలోకి ప్రవేశించిన కొన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా నాశనం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది.ఈ దాడుల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 2 శాతం పెరిగి 93.05 డాలర్లకు చేరింది. ఇదిలావుండగా, గత దాడుల్లో ధ్వంసమైన భూగర్భ క్షిపణి టన్నెళ్లను ఇరాన్ వేగంగా పునరుద్ధరిస్తోందని 'సీఎన్ఎన్' తన కథనంలో వెల్లడించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా, దెబ్బతిన్న 69 టన్నెల్ ప్రవేశ మార్గాల్లో ఇప్పటికే 50 మార్గాలను ఇరాన్ తిరిగి వినియోగంలోకి తెచ్చినట్లు పేర్కొంది. ఈ పరిణామాలు గల్ఫ్ రీజియన్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి.

## కొత్త నాయకత్వం కోసం కాంగ్రెస్ 'టాలెంట్ హంట్'

**మొదటిపేజీ తరువాయి -** ద్వారా ఎంపిక చేస్తారు.సాంప్రదాయ రాజకీయ సంబంధాలు లేకపోయినా కేవలం ప్రతిభ, స్పష్టమైన విజన్, సేవా దృక్పథం ఉన్న మంచి వ్యక్తుల కోసం కాంగ్రెస్ పార్టీ ఈ వేదికను అందిస్తోందని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలకు భిన్నంగా, క్షేత్రస్థాయి నుంచి సరికొత్త రక్తాన్ని పార్టీలోకి ఆహ్వానించడానికి కాంగ్రెస్ వేసిన ఈ అడుగు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహ యువతలో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమం

**మొదటిపేజీ తరువాయి -** చేస్తున్నామన్నారు. రాష్ట్ర రైతుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నామని సీఎం అన్నారు. నేరుగా పేదవాడి ఇంటికి వచ్చి పింఛను ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. కేవలం ఈరోజు బాగుంటే చాలదు, భవిష్యత్ కూడా బాగుండేలా ప్రణాళికలు వేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, విశాఖలో గూగుల్ రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని చంద్రబాబు పేర్కొన్నారు. పరిశ్రమలు వస్తే మన వాళ్లు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదని. విశాఖలో గూగుల్ సంస్థ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. రాష్ట్ర యువత నైపుణ్యాలు పెంచుకొని ఉద్యోగాలు అందుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాదని ఆయన భరోసా ఇచ్చారు. గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతామని, రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు దరిచేరవన్నారు. అందరి జీవన ప్రమాణాలు




పెరగాలన్నదే మా కల అని సీఎం వివరించారు.'పింఛన్లు ఇంటింటికే వచ్చి అందిస్తున్నాం. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. ఏ సమస్యకైనా ఆన్‌లైన్‌లోనే పరిష్కారం చూపుతున్నాం. పీ4 కార్యక్రమం కింద పేదలను ఆదుకుంటున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్, నేను కలిసి పని చేస్తున్నాం. డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తే వైఎస్సార్‌సీపీ ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి ఆ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'.రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యం: తిరుమల వెంకటేశ్వరస్వామి జోలికొస్తే ఆయనే చూసుకుంటారని, హిందూ దేవాలయాలపై దాడులు చేయడం మంచి పని కాదు సీఎం హెచ్చరించారు. ఆలయాలను అపవిత్రం చేయాలని చూస్తే కఠినంగా శిక్షిస్తామన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహంపై దాడి చేసి మాపై నెట్టాలని చూశారని మండిపడ్డారు. ఆరా తీస్తే వైఎస్సార్‌సీపీ వాళ్లే చేసినట్లు రుజువైందన్నారు. విగ్రహం ధ్వంసం చేశారని అబద్ధాలు చెప్పి సానుభూతి కోసం ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.దళితుణ్ని చంపి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఊరేగిస్తారా? అని సీఎం సూటిగా ప్రశ్నించారు. సీబీఎన్ పాలనలో అరాచక శక్తులకు చోటు లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యమని సీఎం హితవు పలికారు. అన్ని ప్రాంతాల అభివృద్ధే మా ధ్యేయమని 2027 పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామన్నారు. కొత్తపల్లి మండలంలో ఫిషింగ్ హార్బర్ తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# దేశంలో జల వనరుల నిర్వహణ కోసం ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

**మొదటిపేజీ తరువాయి -** పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడ్డాయని తెలిపారు.ఈ వర్క్‌షాప్‌లో జల్ సంచయ్ జన భాగీదారీ ప్రచార కార్యక్రమం మూడో దశను సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 2026 జూన్–2027 మే మధ్య రెండు కోట్ల నీటి సంరక్షణ నిర్మాణాలను సృష్టించాలనే లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. గత దశలో 1.5 కోట్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త చొరవతో మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్ – వాటర్ ప్రోగ్రామ్‌ను కూడా సీఆర్ పాటిల్ ప్రారంభించారు. అలాగే భారత్ వాటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వేదిక కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కోసం ఓపెన్ కాల్‌ను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని, నీటి నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేస్తుందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్ అభిప్రాయపడ్డారు. జలవనరులను పరిశీలించడానికి, ముందస్తుగా అంచనా వేయడానికి, నిర్వహించడానికి నేటి అంతరిక్ష సాంకేతికత అపూర్వమైన సామర్థ్యాన్ని అందిస్తోందని తెలిపారు. భూగర్భ జలాల అంచనా, జలవనరుల పర్యవేక్షణ, వరదల ముందస్తు అంచనా వంటి రంగాలలో పనులకు ఈ భాగస్వామ్యం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇస్రో, జలవనరుల రంగం మధ్య సహకారం 1982 నాటిదని గుర్తు చేసుకున్నారు. మరోవైపు, మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్– వాటర్ కార్యక్రమం విద్యాసంస్థలు, ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన బహుళ సంస్థాగత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుందని ఏఎన్ఆర్ఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ కళ్యాణ రామన్ అన్నారు. దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సోమవారం (జూన్ 1న) జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సుస్థిర భూగర్భ జలాల నిర్వహణ, సాంకేతిక ఆవిష్కరణలు, వర్షపు నీటి సేకరణపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, నిపుణులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. దేశంలో నీటి ఆవిష్కరణల భవిష్యత్తుపై చర్చించడానికి నిపుణులు, పరిశోధకులకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా మారింది.

# యూపీఐ సంచలనం.. దశాబ్ద కాలంలో 12,000 రెట్లు పెరిగిన లావాదేవీలు

**మొదటిపేజీ తరువాయి -** భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ తన వృద్ధిని బలంగా కొనసాగిస్తోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిగే లావాదేవీలు మే నెలలో మరోసారి సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ నెలలో లావాదేవీల సంఖ్య (వాల్యూమ్) 23.20 బిలియన్లకు చేరగా, వాటి విలువ దాదాపు రూ.30 లక్షల కోట్ల మార్కును తాకింది. ఈ వివరాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) సోమవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి.ఎన్‌పీసీఐ డేటా ప్రకారం.. మే నెలలో యూపీఐ ద్వారా మొత్తం రూ.29.90 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే లావాదేవీల సంఖ్య 24 శాతం పెరగ్గా, వాటి విలువ 19 శాతం వృద్ధి చెందింది. మే నెలలో సగటున రోజుకు సుమారు 748 మిలియన్ల లావాదేవీలు జరిగాయని, వాటి సగటు విలువ రోజుకు సుమారు రూ.96,465 కోట్లుగా ఉందని




గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఏప్రిల్ నెలతో పోల్చినా లావాదేవీల సంఖ్యలో 3.8 శాతం, విలువలో 3 శాతం పెరుగుదల కనిపించింది.గత ఏప్రిల్ నెలలో కూడా డిజిటల్ చెల్లింపులు 25 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తూ 22.35 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి. వాటి విలువ రూ.29.03 లక్షల కోట్లుగా ఉంది. యూపీఐతో పాటు, ఇతర డిజిటల్ చెల్లింపులైన ఇమ్మీడియట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్) ద్వారా మే నెలలో 358 మిలియన్ల లావాదేవీలు, ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా 88 మిలియన్ల లావాదేవీలు జరిగాయి.కేవలం దేశంలోనే కాకుండా, యూపీఐ సేవలు అంతర్జాతీయంగా కూడా విస్తరిస్తు న్నాయి. యూఏఈ, సింగపూర్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఫ్రాన్స్, మారిషస్, ఖతార్‌తో సహా 8కి పైగా దేశాల్లో ప్రస్తుతం యూపీఐ అందుబాటులో ఉంది. దీంతో డిజిటల్ చెల్లింపుల రంగంలో భారత్ ప్రపంచానికి నాయకత్వం వహిస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో యూపీఐ లావాదేవీల సంఖ్యలో ఏకంగా 12,000 రెట్ల అసాధారణ వృద్ధి నమోదైంది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2 కోట్లుగా ఉన్న లావాదేవీలు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి 24,162 కోట్లకు పైగా పెరగడం విశేషం.

## చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు



**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి చంద్రబాబు 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన, కల్లుగీత కార్మికుడు పోలరపు సింహాచలం ఇంటికి స్వయంగా వెళ్లారు. ఆయనకు రావాల్సిన పింఛనును చేతికి అందించి ఆశ్చర్యపరిచారు.ఈ సందర్భంగా సింహాచలం కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, వారి జీవన విధానం గురించి ఆరా తీశారు. అత్యంత శ్రమతో కూడిన కల్లుగీత వృత్తిలోని కష్టనష్టాలు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో, తమకు సొంత ఇల్లు లేదని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు.అనంతరం, తాటి చెట్టు నుంచి కల్లు తీసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. గీత కార్మికులు అప్పుడే తీసిన తాజా తాటి కల్లును రుచి చూశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పేద ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభకు బ్రేక్



**మొదటిపేజీ తరువాయి -** ఇటీవల ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం, ఆ తర్వాత ఏపీకి చెందిన జనసేన సహా కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని పోలీసులు తెలిపారు. ఈ పరిణామాల వల్ల తెలంగాణలోని విద్యార్థి సంఘాలు, ఇతర బృందాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రాష్ట్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొందని వివరించారు.అంతేకాకుండా, జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కావడంతో ఈ సమయంలో సమావేశం నిర్వహించడం సమంజసం కాదని పోలీసులు అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితుల్లో సభ నిర్వహిస్తే శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగే అవకాశం ఉందని, నిరసనలు, ఆందోళనలు జరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.వీటితో పాటు, సమావేశం జరగాల్సిన సంధ్యా కన్వెన్షన్‌కు తగినంత పార్కింగ్ సౌకర్యం లేదని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రతిపాదించిన ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్‌కు సంబంధించిన స్థలంపై న్యాయపరమైన వివాదాలు ఉన్నాయని, ఆ స్థలంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో మూడు క్రిమినల్ కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తమ ఉత్తర్వుల్లో వివరించారు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రజా శాంతికి భంగం కలగకూడదనే ఉద్దేశంతో సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు డీసీపీ తెలిపారు. జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ తాళ్లూరి రామ్ ఈ సమావేశం కోసం మే 29న పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ - నేడు 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

**మొదటిపేజీ తరువాయి -** చేసింది. నోటిఫికేషన్‌ల విడుదలతోపాటు పరీక్ష విధానంలో తీసుకురానున్న మార్పులపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వివరాలను వెల్లడించారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఊపందుకోనుంది. టీజీపీఎస్సీ ద్వారా అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నెలలో 2 నుంచి 3 నోటిఫికేషన్‌లు విడుదల చేస్తామన్నారు. నేడు ఒకేసారి 3 కొత్త ఉద్యోగ ప్రకటనలిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. టీజీపీఎస్సీలో ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, మరో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలున్నాయని వివరించారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదలచేసే యోచనలో ఉన్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.పరీక్షల నిర్వహణలో లీకేజీలకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ వివరించారు. భవిష్యత్‌తో పరీక్షలను ాపీ= విధానంలో కాకుండా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆ విధానంలో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులకి మార్కులు తెలిసే అవకాశం ఉంటుందన్నారు. యూపీఎస్సీకి చెందిన ప్రతిభాసేతు తరహాలో రాష్ట్రంలో ప్రతిభా భారతి కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొలువులివ్వడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం తెలిపారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదన్నారు." నేడు మూడు నోటిఫికేషన్లు వస్తాయి. మరో వారంలోనే మరికొన్ని ఉద్యోగ భర్తీకి ప్రకటన లొస్తాయి. ఈనెలలోనే సుమారుగా 5 నుంచి 6 నోటిఫికేషన్‌లు ఇస్తాం. తక్కువ పోస్టులున్న వాటిని ఎలా భర్తీ చేయాలో ఆలోచన చేస్తున్నాం. ప్రతి రెండు మూడు నెలలకు ఫలితాలను ప్రకటిస్తాం. మూడు నుంచి గరిష్టంగా 6 నెలల కాలంలో ఉద్యోగాల్లో చేరాలా చర్యలు తీసుకుంటాం. టీజీపీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేయడం మంచిదికాదు"

# జర్నలిస్టు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

## జర్నలిస్టులు ప్రజా సేవకులు -- ప్రభుత్వపరంగా సౌకర్యాలు కల్పిస్తాం

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్






**జగిత్యాల, జూన్ 01 (ప్రజా మంటలు):** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని విరుపాక్షి గార్డెన్లో నిర్వహించిన ప్రెస్ క్లబ్ జగిత్యాల నూతన కార్యవర్గ పరిచయ, ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వం-- ప్రజల మధ్య వారధిగా పనిచేస్తారని అన్నారు. సోషల్ మీడియా యుగంలో విలువలతో కూడిన జర్నలిజం అవసరమని, తప్పుడు ప్రచారాన్ని అరికట్టాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందన్నారు. పాత్రికేయ మిత్రులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ కార్యాలయానికి స్థలం, నిధులు మంజూరు చేసి భవనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు అంతస్తు నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు కృషి చేస్తానని, గత ప్రభుత్వ కాలంలో కూడా డబుల్ బెడ్రూమ్ ఇళ్ల మంజూరుకు ప్రయత్నాలు చేసినట్లు పేర్కొన్నారు. విద్య, ఆరోగ్య రంగాల్లో జర్నలిస్టులకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రాధాన్యం కల్పించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి సేవ చేస్తున్నప్పటికీ గత 25 ఏళ్లుగా ఇంటి స్థలాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు అందకపోవడం బాధాకరమన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు, పిల్లలకు విద్యాసంస్థల్లో 50 శాతం రాయితీ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక ఒత్తిడులు, సమస్యల మధ్య విధులు నిర్వహిస్తున్నారని, వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, డీసీసీ అధ్యక్షుడు ఘాజంగి నందయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అడ్వాల జ్యోతి లక్ష్మణ్, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి ప్రవీణ్, కాంగ్రెస్ నాయకుడు బండ శంకర్ తదితరులు పాల్గొని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రెస్ క్లబ్ జగిత్యాల నూతన అధ్యక్షుడు ఎల్లాల రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, పిల్లలకు విద్యా రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం కృషి చేస్తాం

### క్రీడలతో మానసిక ఉల్లాసం - ఏకాగ్రత పెరుగుతుంది

### క్రీడల్లో గెలుపు - ఓటములు సహజం

### క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది


### జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, - చుక్క గంగారెడ్డి - (ప్రజా మంటలు) జూన్ 1:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వారి ఆద్వర్యం లో జగిత్యాల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు కు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్నిజగిత్యాల వివేకానంద మినీ స్టేడియంలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడలతో మానసిక ఉల్లాసం - ఏకాగ్రత పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు - ఓటములు సహజం అని తెలిపారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అసోసియేషన్ సెక్రటరీ దాడి జలపతి, కోశాధికారి రౌతు గంగారెడ్డి, నాయకులు బండ శంకర్, చెట్టే గంగాధర్, దయల శంకర్, కుసరి అనిల్, నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, రౌతు గంగాధర్, ముస్కు నారాయణ రెడ్డి, సుధాకర్ రావు, యం ఏ ఆరిఫ్, శశి, చిట్ల మనోహర్, ప్రభాకర్ రావు, బాపిరాజు, అంజయ్య గౌడ్, రాజు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## భీమదేవరపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల నిషేధం

### గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం


గ్రామ పంచాయతి కార్యాలయము

**భీమదేవరపల్లి, జూన్ 01 ( ప్రజా మంటలు):-** భీమదేవరపల్లి గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలోని బెల్ట్ షాపులను నిషేధిస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. సోమవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో బెల్ట్ షాపుల వల్ల యువత చెడు మార్గం పట్టడం, గ్రామంలో గొడవలు పెరగడం వంటి సమస్యలు చర్చకు వచ్చాయి. దీంతో గ్రామంలో అక్రమంగా నడుస్తున్న బెల్ట్ షాపులను వెంటనే బంద్ చేయాలని సభ్యులందరూ తీర్మానించారు. నిషేధం అమలుకు కఠిన చర్యలు తీసుకుంటామని పాలకవర్గం హెచ్చరించింది. ఈ సమావేశంలో సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ఉప సర్పంచ్ శనిగరం అయిలయ్య, కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు ప్రేమలత, సదానందం, శ్రీనివాస్ రెడ్డి, పోలు అశోక్, సాగంటి వెంకటేశ్వర్లు, బొల్లంపల్లి శ్యామ్, విజయ, సంధ్య పాల్గొన్నారు.

## 16 నెలలుగా నివేదిక ఇవ్వని "డిపివో" చీకోటి మదన్ మోహన్

### రాష్ట్ర కమీషనర్ ఆదేశాలు కూడా భే ఖాతర్

### చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు పిర్యాదు



**కోరుట్ల / జగిత్యాల జిల్లా జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) జూన్ 1:** జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారి చీకోటి మదన్ మోహన్ గత 16 నెలలుగా నివేదిక సమర్పించకుండా జాప్యం చేస్తున్నారని పలు అనుమానాలతో ఆరోపిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజా వాణిలో కోరుట్లకు చెందిన చుక్క గంగారాజం పిర్యాదు చేశారు. 2025 సెప్టబర్ మాసంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ జారీ చేసిన ఆదేశాలను సైతం జిల్లా పంచాయతీ అధికారి భే ఖాతర్ చేశారని పిర్యాదు దారుడు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడారు . కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి పై 2025 మార్చ్ 3న జిల్లా పంచాయతీ అధికారికి పిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కోరుట్ల ఎంపివో విచారణ అనంతరం పంచాయతీ కార్యదర్శి కి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. సంజాయిషీ స్వీకరించిన డిపివో చట్టపరమైన చర్యల కొరకు జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించాల్సి ఉంది. కానీ జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారి చీకోటి మదన్ మోహన్ నేటి వరకూ జిల్లా కలెక్టర్ కు ఎలాంటి నివేదిక సమర్పించకుండా కాల యాపన చేస్తున్నారని పిర్యాదు దారుడు చుక్క గంగారాజం ఆరోపించారు. అనేక మార్లు పిర్యాదులు చేస్తూ ప్రత్యక్షంగా డిపోవో ను కలిసినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిపివో చేస్తున్న కాలయాపన పై తనకు పలు అనుమానాలు కూడా కలుగుతున్నాయని జిల్లా కలెక్టర్ కు సోమవారం ఇచ్చిన పిర్యాదులో చుక్క గంగారాజం పేర్కొన్నారు.

## సమాచార హక్కు సాధన కమిటీలో పదోన్నతి

### జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగు మణిదీప్




**భీమదేవరపల్లి జూన్01( ప్రజా మంటలు) :-** సమాచార హక్కు చట్టం ప్రచారం, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేస్తున్న యువ సామాజిక కార్యకర్త రంగు మణిదీప్‌కు పదోన్నతి లభించింది. హనుమకొండ జిల్లా సమాచార హక్కు సాధన కమిటీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆయనను రాష్ట్ర కమిటీ నియమించింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రంగు మణిదీప్ గతంలో జిల్లా సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థ కార్యక్రమాల విస్తరణకు కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ జిల్లా ఉపాధ్యక్ష పదవిని అప్పగించింది. ఈ సందర్భంగా రంగు మణిదీప్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి పదోన్నతి కల్పించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాచార హక్కు చట్టం బలోపేతం, ప్రజల్లో అవగాహన పెంపు కోసం మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. రంగు మణిదీప్‌కు పదోన్నతి లభించడంతో గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, స్నేహితులు, కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు..

## తలసానిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

### ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయి

### మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి



**సికింద్రాబాద్, జూన్ 01 (ప్రజా మంటలు):** సనత్‌నగర్ నియోజకవర్గంలో స్థానిక శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ వైఖరిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ఆయనను ఇంటికి సాగనంపే రోజులు దగ్గరపడ్డాయని మాజీ మంత్రి, బీజేపీ నేత మర్రి శశిధర్ రెడ్డి ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన తాగునీటి ఎద్దడి, మురుగునీటి సమస్యలపై నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన సోమవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎండీ దృష్టికి తీసుకెళ్లి, వాటిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని సనత్‌నగర్, బీకే గూడ, ఎస్ఆర్ నగర్, అమీర్‌పేట్, న్యూ బోయిగూడ, న్యూ బోలక్‌పూర్, బన్సీలాల్‌పేట్ తదితర ప్రాంతాల్లో ప్రజలు తీవ్రమైన లో-ప్రెషర్ నీటి సమస్యలతో అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పలు కాలనీల్లో మురుగునీరు రోడ్లపైనే పొంగిపొర్లుతున్నా, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాత్రం వాటిని పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిని, ప్రజల కనీస అవసరాలను గాలికొదిలేసిన తలసానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## జేఈఈ అడ్వాన్స్ ఎగ్జామ్స్ లో ఉత్తీర్ణత సాధించిన నల్లా కాన్షి రామ్





**హైద్రాబాద్ / జగిత్యాల జిల్లా ప్రతినిధి,** - చుక్క గంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ ( ప్రజా మంటలు) జూన్ 1: ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ ఎగ్జామ్స్ (ఐఐటీ ఎంట్రన్స్ టెస్ట్) లో నాచారంకు చెందిన నల్లా కాన్షి రామ్ ఉత్తీర్ణత సాధించారు. భారత దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సాంకేతిక విద్య సంస్థలైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) సంస్థలల్లో ప్రవేశం కోసం మే 17వ తేదీన దేశ వ్యాపితంగా 1,90000 ( ఒక లక్ష తొంబై వేల) మంది పరీక్ష రాశారు. అందులో కాన్షి రామ్ అల్ ఇండియా స్థాయిలో 5407 ర్యాంకు సాధించారు. అంతకు ముందు ఏప్రిల్ లో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్ కు సుమారుగా 13 లక్షల మంది హాజరవగా 2 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో నల్లా కాన్షి రామ్ 92 శాతంతో ఉత్తీర్ణత సాధించి జేఈఈ అడ్వాన్స్ ఎగ్జామ్ కు అర్హత సాధించారు. ఈ సందర్భంగా తాను చదివిన కాలేజ్ సిబ్బందికి, కోచింగ్ ఇన్స్టిట్యూట్ టీచర్స్ కి, జన్మనిచ్చిన తల్లి తండ్రులైన నల్లా రాధాకృష్ణ - చీరాల అన్నపూర్ణ లకు కృతజ్ఞతలు తెలియ జేశారు. తాను గొప్ప ఇంజనీర్ అయి రాష్ట్రానికి, దేశానికి పేరు తేవాలన్నదే తన కోరిక అని ఖాన్సీ రామ్ తెలిపారు. తన తండ్రి నల్లా రాధా కృష్ణా బహుజనుల ఆశయాల కోసం చేసిన సేవలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన ( తన తండ్రి) చేస్తున్న జాతీయ - అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సేవలకు అనుకూలంగా నేను కూడా ఈ భారత దేశ పౌరులకు నావంతు బాధ్యతగా సేవలు అందించి మెప్పు పొందాలి అనేదే నా సంకల్పమని ఖాన్సీ రామ్ వివరించారు.

## ఇసుక దందాలో డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా

### రాష్ట్ర సంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**గొల్లపల్లి జూన్ 01ప్రజా మంటలు :** ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈసందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై ఏలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వకాలంలో జోరుగా ఇసుక దందాసాగిందని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరేళ్ల గ్రామం నుంచి మానేరు ఇసుకను రోజు వందల లారీల్లో రవాణ చేసే వారని మంత్రి అన్నారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న క్రమంలో పలువురు లారీల కింద పడి మరణించారని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు. నేరేళ్ల దళితులు అక్రమ ఇసుక రవాణపై అందోళన చేస్తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులపై థర్డ డిగ్రీ ఉపయోగించిందని మంత్రి అడ్లూరి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో దళితులపై జరిగిన దాడులపై మాట్లాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మపురి నియోజకవర్గంలో ఇసుక దందాలో తనకు వాట ఉందని మాట్లాడుతున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. ఇసుక దందాలో తాను డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే రాజీనామా చేయడానికి సిద్దమని మంత్రి అడ్లూరి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని మంత్రి అడ్లూరి హితవు పిలికారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి - చుక్క గంగారెడ్డి - ( ప్రజా మంటలు), జూన్ 1:** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మాట్లాడుతూ.... పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 67 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పొగాకు నిషేధ దినోత్సవం - 2026 సందర్భంగా జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ప్రజా వాణికి గీత కార్మికులు

### 25 గ్రామాలకు రెండేసి బోర్ వేల్ లు కోరిన గౌడన్నలు

### కాలిన ఈత - తాటి వనం కు 10 లక్షల పరిహారం కోసం వినతి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి - చుక్క గంగారెడ్డి - ( ప్రజా మంటలు) జూన్ 1:** జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజా వాణికి జిల్లాలోని 25 గ్రామాల గీత కార్మికులు తరలి వచ్చారు. అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్ కు వారంతా కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ గొల్లపెల్లి చంద్రశేఖర్ గౌడ్ మాట్లాడుతూ 25 గ్రామాల ప్రతి గౌడ సంఘానికి 2 బోర్లు ఇవ్వాలని కోరారు. ఈత వనం - తాటివనం కాలిపోయిన సంఘానికి 10 లక్షల రూపాయలు సంఘానికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈతవనం దగ్ధమై జీవనోపాధి కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం అందజేసి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గీత కార్మికులకు చనిపోతే 5 లక్షలు ఇవ్వడం కాదు బ్రతికి ఉన్నప్పుడు 10 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను ఆయన కోరారు. ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల గౌడ సంఘం మండల అధ్యక్షుడు బొలెపెల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బావు శంకర్ గౌడ్, బత్తిని శంకర్ గౌడ్, ముంజ జలంధర్ గౌడ్, రామకృష్ణ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, సుధవేని భూమయ్య గౌడ్, పుల్ల శ్రీనివాస్ గౌడ్, సుమారు 150 మంది సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్ ను పరామర్శించిన మాజీ మున్సిపాలిటీ చైర్మన్



**హైదరాబాద్ జూన్ 01 ప్రజా మంటలు):** మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్ ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో, హైదరాబాద్‌లోని వారి నివాసంలో జగిత్యాల పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ జి.ఆర్. దేశాయి మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా జి.ఆర్. దేశాయి, రాజేశం గౌడ్, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్ గారు తమను ఆత్మీయంగా పరామర్శించినందుకు జి.ఆర్. దేశాయికి ,హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అద్దెలే కట్టలేక 'పోతున్నాం'

హైదరాబాద్ నగర శివార్లలో ఇళ్లు వెతుక్కుంటున్న ఉద్యోగులు!

హైదరాబాద్ మహా నగరంలో ఏటికేడు పెరుగుతున్న ఇంటి అద్దెలు

మధ్య తరగతి కుటుంబాలపై మోయలేని భారం

భారీ అద్దెలు భరించలేక నగర శివార్లలో ఉండేందుకు మొగ్గు చూపుతున్న ఉద్యోగులు



భాగ్యనగరం ఐటీ, ఫార్మా రంగాల్లో సాధిస్తున్న అద్భుతమైన ప్రగతి కారణంగా దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా నిలిచింది. ఈ వేగవంతమైన ఆర్థిక వృద్ధి వెనక మధ్య, దిగువ మధ్య తరగతి కుటుంబాలు ఒక తీరని ఆర్థిక భారాన్ని మోస్తున్నాయి. అదే నగరంలో విపరీతంగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు. గత మూడు నాలుగు ఏళ్లుగా నగరంలో నివాస గృహాల అద్దెలు ఊహించని రీతిలో 50 శాతం నుంచి 60 శాతం వరకు పెరగడం సామాన్యుల రోజువారీ జీవితాలను పూర్తిగా అతలాకుతలం చేస్తోంది. హైదారాబాద్ మహానగరంలో సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ఇళ్లు కొనడమే కాదు, కనీసం కిరాయికి ఉండాలన్నా భారంగానే మారింది. నగరంలో ఏటికేడు అద్దెలు భారీగా పెంచటమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సాధారణంగా వేసవి సెలవుల్లో ఇళ్లు ఎక్కువగా ఖాళీ అవుతుంటాయి. మళ్లీ తిరిగి జూన్ నెలలో భర్తీ అవుతాయి. ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్, పిల్లలు కొత్త విద్యాసంస్థల్లో చేరడం, జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చేవారు కిరాయి ఇళ్ల కోసం వెతుకుతున్నారు. ప్రస్తుతం భారీగా అద్దెలు ఉంటున్న తరుణంలో భరించలేక నగర శివార్లలో ఉంటున్నారు. ఐటీ కారిడార్, ఉపాధి అవకాశాలు ఉన్నచోట రెంట్లు అధికం. మణికొండ పంచవటి కాలనీలో 3 బీహెచ్‌కే ఫ్లాట్ అద్దె రూ.40 నుంచి రూ.50 వేల మధ్య ఉంది. 2 బీహెచ్‌కేకు రూ.25 నుంచి రూ.30 వేల వరకు చెబుతున్నారు. వీకర్ సెక్షన్ ప్రాంతానికి వెళ్తే రూ.18 నుంచి రూ.20 వేల వరకు ఉన్నాయి. బాచుపల్లిలో కొత్త ఫ్లాట్లలో 2 బీహెచ్‌కే అద్దె దాదాపుగా రూ.20 వేల వరకు ఉంది. కిస్మత్‌పూర్‌లో అయితే రూ.25 వేల వరకు చెబుతున్నారు. కేపీహెచ్‌బీలో పాత ఫ్లాట్లలో రూ.20 నుంచి రూ.25 వేల వరకు రెంట్లు ఉన్నాయి. ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, కొండాపూర్, తెల్లాపూర్, నల్లగండ్ల, గండిపేట, గచ్చిబౌలి, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీల్లో 2 బీహెచ్‌కే రూ.40 నుంచి రూ.50 వేల వరకు చెబుతున్నారు. 3 బీహెచ్‌కేకు రూ.60 నుంచి రూ.80 వేలు. విల్లాలకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు చెల్లిస్తున్న వారు కూడా ఉన్నారు. మెయింటనెన్స్ రూ.2 నుంచి రూ.6 వేల వరకు ఉంటాయి. మళ్లీ దీనికి కరెంటు, నీటి బిల్లులు అదనం. రూ.లక్షల్లో జీతాలు, భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తుంటే మాత్రం ఇంటి అద్దెకు పెద్ద సమస్య కాదు. రూ.50 వేలలోపు శాలరీ తీసుకుంటున్న వారు అద్దెలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు ఫీజులు, ఆరోగ్యం కోసమే సగం శాలరీ ఖర్చు చేయాల్సి ఉంటోంది. ఇక ఇంటి అద్దె రూ.20 వేలు కట్టలేక సింగిల్ బెడ్‌రూం ఇంటికి, శివార్లలో రూ.10 వేలలోపు రెంట్లు ఉండే ఇళ్లకు వెళ్లి సర్దుకుంటున్నారు. ఐటీ కారిడార్‌లో పని చేసే ఒక ఉద్యోగి తన బడ్జెట్‌లో ఇంటి అద్దెలు ఉండటంతో ఘట్‌కేసర్ సమీపంలోని ఈసీఐఎల్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. కానీ ట్రాఫిక్ కారణంగా రోజూ రాకపోకలకు 4 గంటల సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆకాశాన్ని తాకుతున్న భూముల ధరలతో ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగి ఆ ప్రభావం నేరుగా రెంట్లపై పడుతోంది. రూ.కోటి లేనిదే సౌకర్యంగా ఉండే ఇల్లు కొనే పరిస్థితులు ఇప్పుడైతే కనిపించడం లేదు. ఒకవ్వళ లోన్ తీసుకుని ఇంటిని నిర్మించి ఉంటే వచ్చే కిరాయిలు ఈఎంఐకి సరిపోవాలని యజమానులు ఆశిస్తున్నారు. ముంబయిలో లోకల్ ట్రైన్ ఉండటంతో దూరమైనా గంటలో సిటీకి చేరుకుంటారు. అద్దెలు భారమై జనం శివార్లకు వెళ్తున్న నేపథ్యంలో వారి కోసం ప్రభుత్వం ప్రజా రవాణా సౌకర్యాలు మరింత పెంచాల్సి ఉంది. అదే విధంగా చూస్తే మెట్రోను విస్తరించాలని తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వి.రావు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఏపీ నుంచి చైనాకు 2,700 టన్నుల బియ్యం ఎగుమతి

ఐదేళ్ల తర్వాత రికార్డ్

ఆంధ్రప్రదేశ్ నుంచి, చెన్నై పోర్టుకు ఎగుమతి అక్కడి నుంచి నౌక ద్వారా చైనాకు

మరోసారి మైలురాయిని చేరుకున్నట్లుగా ఎక్స్‌లో కాన్‌కర్ సంస్థ పోస్ట్

40 శాతం ఖర్చు ఆదా



2,700 టన్నుల బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి, చెన్నై పోర్టుకు ఎగుమతి చేసినట్లు ఐసీడీ అధికారులు ఎక్స్ ద్వారా తెలిపారు. గత నాలుగైదు ఏళ్లలో ఎప్పుడూ జరగని విధంగా ఈ ఏడు మళ్లీ ఇలా జరగడం ఒక రికార్డ్‌గా మారింది. దీంతో దాదాపు ఐదేళ్ల తర్వాత తండియార్‌పేట్‌లోని కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలో బీసీఎన్ వ్యాగన్‌ల ద్వారా ఎగుమతి సరుకుల నిర్వహణ పునఃప్రారంభించినట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని సామర్లకోట, తణుకులోని కేంద్రాల వద్ద 105 టీఈయూ కంటైనర్ల ద్వారా రవాణా చేశారు. 42 వ్యాగన్లలోకి ఎక్కించిన ఈ బియ్యాన్ని 573 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తండియార్‌పేట్ డిపోకు తరలించారు. అక్కడ ఆ బియ్యాన్ని కంటైనర్లలోకి మార్చి, ఆపై చెన్నై పోర్టుకు సంబంధించిన ఒక ప్రత్యేక నౌక ద్వారా బియ్యాన్ని చైనాకు రవాణా చేశారు. గత నాలుగైదు సంవత్సరాలలో ఇంత భారీ స్థాయిలో బియ్యం ఎగుమతులు జరగలేదని తండియార్‌పేట్ ఐసీడీ అధికారులు వెల్లడించారు. ఆహార భద్రతా చర్యలలో భాగంగా, 2022-23 కాలంలో భారతదేశం నుంచి చైనాకు భారీ ఎత్తున బియ్యం ఎగుమతిని నిషేధించారు. ఆ తర్వాత వరి సాగు విస్తీర్ణం పెరగడం, బియ్యం నిల్వలు మిగులు ఉండటంతో కేంద్ర ప్రభుత్వం 2025 నుంచి ఎగుమతులపై ఆంక్షలను క్రమంగా సడలించడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో చైనా వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని బియ్యం ఎగుమతి ఏజెంట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. లాజిస్టిక్స్, రవాణా బాధ్యత తమకే అప్పగించినట్లు జూచీజూ= అధికారులు తెలిపారు. సామర్లకోట-తణుకు వద్ద బియ్యం లోడింగ్ చేయడం చెన్నై మీదుగా రవాణా చేయడం, చివరగా చైనాకు నౌక ద్వారా పంపడం ఈ మొత్తం ప్రక్రియను ఒక్క రోజులోనే పూర్తి చేయడం ఒక రికార్డు విజయమని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రహదారి మార్గం ద్వారా కాకుండా రైలు వ్యాగన్ల ద్వారా బియ్యం రవాణా చేయడం వల్ల రవాణా ఖర్చులలో 40% ఆదా అయినట్లు వారు వివరించారు. విశాఖపట్నం పోర్టులో ఎగుమతి ఛార్జీలు అధికంగా ఉండటం, దానికి తోడు తగినన్ని కంటైనర్లు అందుబాటులో లేకపోవడంతో తాము చెన్నై పోర్టును ఎంచుకుంటున్నట్లు ఏజెంట్లు తెలిపారు.

# కుమారుడిని చంపి మిస్సింగ్ అంటూ డ్రామా

ఏడాదిన్నర తర్వాత గుట్టురట్టు!

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని కుమారుడిని చంపిన తల్లి

ఏడాదిన్నర తర్వాత మృతదేహం వెలికితీత

నిజం నిగ్గుతేలిన వేళ తల్లి అనుమానాస్పద మృతి





నేటి కాలంలో వివాహేతర సంబంధాలు దాంపత్య బంధాన్ని కడతేర్చుతున్నాయి. ఓ వైపు ఆ మోజులో పడి కట్టుకున్న వాడిని, కడుపున పుట్టిన పిల్లలను వదిలేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు అడ్డొస్తే చంపడానికి సైతం వెనకాడటం లేదు. ఆ తర్వాత జరిగే పరిణామాలు తెలిసినా క్షణిక సుఖాల కోసం కుటుంబాలను వీధిపాలు చేస్తున్నారు. తద్వారా జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. వివాహేతర సంబంధాలు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయనడానికి ఈ ఘటనే తాజా ఉదాహరణ. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కుమారుడిని ప్రియుడితో కలిసి ఓ తల్లి చంపేసింది. అంతేకాక తన బిడ్డ కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అంతటితో ఆగకుండా ఈ మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించడం లేదంటూ హైకోర్టు మెట్లెక్కింది. చివరికి నిజం బయటపడే సమయానికి ఆ తల్లి అనుమానస్పద రీతిలో మృతిచెందింది. మానవ సంబంధాలకే మచ్చతెచ్చే ఈ ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. కౌతాళం మండలం బదినేహాలు గ్రామంలో చెందిన చిన్నమల్లయ్య, గంగమ్మ దంపతులకు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్నమల్లయ్య కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డుప్రమాదంలో మరణించాడు. గంగమ్మకు ఆదోని మండలం జి.హొసళ్లి గ్రామానికి చెందిన బంధువు దర్గప్పతో వివాహేతర సంబంధం ఏర్పడింది. దర్గప్ప తరచూ తమ ఇంటికి రావడం నచ్చని గంగమ్మ పెద్దకుమారుడు వీరేశ్(17) అతనితో పలుమార్లు ఘర్షణకు దిగాడు. దీంతో వీరేశ్‌ను అడ్డు తొలగించుకోవాలని గంగమ్మ, దర్గప్ప పథకం వేశారు. ఈ క్రమంలో 2024 నవంబర్‌లో ఇంట్లోనే వీరేశ్‌ను కత్తితో పొడిచి చంపేశారు. మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి, బైక్‌పై తీసుకెళ్లి సమీప శ్మశానంలో పాతిపెట్టారు. మరోవైపు గంగమ్మ, తన కుమారుడు వీరేశ్ కనిపించడం లేదని 2024 నవంబరు 11న గంగమ్మ కౌతాళం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఈ కేసును కొలిక్కి తేలేకపోయారు. హైకోర్టును ఆశ్రయిస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని కొందరు సలహా ఇవ్వడంతో గంగమ్మ ఆశపడింది. తన కుమారుడి ఆచూకీ తెలియడం లేదని, పోలీసులు సరిగ్గా వెతకడం లేదని ఇటీవల పిటిషన్ వేసింది. దీన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించి, వీరేశ్ అదృశ్యంపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని డీజీపీకి ఆదేశాలిచ్చింది. స్పందించిన డీజీపీ ఈ కేసు దర్యాప్తునకు గుంటూరు సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ, డీఎస్పీ రవికుమార్ తదితరులతో కలిపి సిట్ వేశారు. రెండు వారాలుగా సిట్ సభ్యులు ఆరాతీయగా గంగమ్మ కిరాతకం వెలుగులోకి వచ్చింది. వీరేశ్‌ను గంగమ్మ, దర్గప్పలు కలిసి చంపేసినట్లు నిర్ధారించుకున్నారు. పోలీసులు ఆదివారం జి.హొసళ్లికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. అస్థిపంజరం వద్ద దొరికిన తాడు, టవల్, దుప్పటి చూసి మృతుడి కుటుంబసభ్యులు అవి వీరేశ్‌వని గుర్తించారు. అస్థిపంజరం నుంచి నమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తామని పోలీసులు పేర్కొన్నారు. ఇంతలో ఆదివారం గంగమ్మ అనుమానాస్పదస్థితిలో మరణించడం సంచలనంగా మారింది. అనారోగ్యంతో రెండు రోజుల కిందట ఆమె ఆదోని ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి శనివారం నాడు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోలీసు బందోబస్తు మధ్య బదినేహాలుకు తీసుకొచ్చి హడావుడిగా అంత్యక్రియలు జరిపించారు. గంగమ్మది లాకప్‌డెత్ అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమెను పోలీసులు విచారణకు తీసుకెళ్లాకే లాకప్‌లో చనిపోయిందని గ్రామస్థులు ఆరోపించారు. సహజ మరణమే అయితే పోలీసుల పర్యవేక్షణలో హడావుడిగా అంత్యక్రియలు ఎందుకు జరిపించారని వారు ప్రశ్నించారు. సిట్ అధికారులకు ఈనాడు ప్రతినిధులు ఫోన్ చేయగా స్పందించలేదు. గంగమ్మది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరేశ్ హత్య కేసులో దర్గప్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# గనుల డిపోలో భారీ పేలుడు.. మయన్మార్‌లో 55 మంది మృతి

చైనా సరిహద్దు సమీపంలోని తిరుగుబాటుదారుల ప్రాంతంలో ఘటన

మృతుల్లో 25 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులు

వాయుసేన దాడి అని పొరబడిన స్థానిక ప్రజలు

రసాయనాల అస్థిరత వల్లే ప్రమాదమని తిరుగుబాటు గ్రూపు వెల్లడి



అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న మయన్మార్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తిరుగుబాటుదారుల నియంత్రణలో ఉన్న షాన్ రాష్ట్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. గనుల తవ్వకాల కోసం నిల్వ ఉంచిన పేలుడు పదార్థాల డిపో ఒక్కసారిగా పేలిపోవడంతో 55 మంది ప్రాణాలు కోల్పోగా, 74 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. చైనా సరిహద్దుకు కేవలం 3 కిలోమీటర్ల దూరంలోని నమ్‌ఖామ్ టౌన్‌షిప్ పరిధిలోని కౌంగ్ టాట్ గ్రామంలో ఈ విషాదం జరిగింది. మృతుల్లో 30 మంది పురుషులు, 25 మంది మహిళలు ఉన్నట్లు స్థానిక మీడియా సంస్థలు, బీబీసీ కథనాలు వెల్లడించాయి. పేలుడు ధాటికి సమీపంలోని సుమారు 100 ఇళ పూర్తిగా ధ్వంసమయ్యాయని అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. మయన్మార్‌లో సైనిక ప్రభుత్వానికి, తిరుగుబాటు గ్రూపులకు మధ్య పోరాటం జరుగుతున్న నేపథ్యంలో తొలుత ఈ పేలుడును ప్రభుత్వ సైన్యం జరిపిన వైమానిక దాడిగా స్థానికులు భావించారు. ఆకాశంలో దట్టమైన నల్లటి పొగలు కమ్ముకోవడంతో ప్రాణభయంతో పరుగులు తీశారు. అయితే, ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని తర్వాత స్పష్టత వచ్చింది. ఈ ప్రాంతాన్ని పాలిస్తున్న తాంగ్ నేషనల్ లిబరేషన్ ఆర్మీ ఈ ఘటనపై స్పందించింది. గనులు, క్వారీల కోసం తమ ఆర్థిక విభాగం నిల్వ ఉంచిన 'జెలిగ్నైట్' వంటి పేలుడు పదార్థాలు అస్థిరత కారణంగా పేలిపోయాయని ఓ ప్రకటనలో తెలిపింది. బాధితులకు సహాయం అందిస్తామని, ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చింది. ప్రస్తుతం స్థానిక స్వచ్ఛంద సంస్థలు సహాయక చర్యలు చేపట్టాయి.

# పులులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై దృష్టి

శ్రీశైలం ఘాట్‌లో పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

డబ్ల్యూఐఐతో అధ్యయనం చేయించాలని నిర్ణయించిన ఎన్‌హెచ్‌ఏఐ

వంతెన అందుబాటులోకి వస్తే రాత్రి సమయంలోనూ ఘాట్‌లో రాకపోకలు



నల్లమల్ల అటవీ ప్రాంతం పరిధి శ్రీశైలం ఘాట్‌లో ఎలివేటెడ్ వంతెన నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది. అయితే ఆ పరిసరాల్లో నివసించే పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు మాత్రం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలనే అంశంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దృష్టి పెట్టారు. అందులో భాగంగా వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ)తో అధ్యయనం చేయించాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో దోర్నాల నుంచి శ్రీశైలం డ్యాం సమీపం వరకు, అలాగే తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ వైపు ఉన్న బ్రాహ్మణపల్లి నుంచి జలాశయం వరకు జాతీయ రహదారి-765ని విస్తరించేందుకు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) సిద్ధమైంది. అయితే నాలుగు వరుసలుగా హైవే విస్తరణకు పెద్దఎత్తున అటవీ భూమి అవసరం ఉంటుంది. దీనికి బదులు ఆంధ్రప్రదేశ్ పరిధిలోని 41.39 కి.మీ., తెలంగాణ రాష్ట్రంలో 45.35 కి.మీ. కలిపి మొత్తం 86.74 కి.మీ. మేర ఎలివేటెడ్ వంతెన నిర్మించేలా అధికారులు ప్రతిపాదించారు. దీంతో వంతెనకు అవసరమైన పిల్లర్లు నిర్మించేందుకు తప్ప, ఎక్కడ పెద్దఎత్తున అటవీ భూమి అవసరం ఉండదు. ఈ ప్రతిపాదన నేపథ్యంలో వన్యప్రాణుల రక్షణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఎలివేటెడ్ వంతెన నిర్మించాలనుకునే చోట నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్, అలాగే అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతాలు ఉన్నాయి. దీంతో డబ్ల్యూఐఐ బృందం ఈ ప్రాంతంలో పులులు ఎక్కువగా ఎటువైపు రాకపోకలు సాగిస్తుంటాయి అనే దానిపై దృష్టి పెట్టారు. అంతేగాక వాటి కదలికలు ఎక్కడ అధికంగా ఉంటాయి, తదితర అంశాలపై అధ్యయనం చేస్తున్నారు. వన్యప్రాణులు తిరిగేందుకు కల్వర్టులు వంటి నిర్మాణాలు ఎక్కడెక్కడ అవసరం, ఎలివేటెడ్ వంతెన ఎత్తు ఎక్కడెక్కడ ఎంత ఉండాలి వాటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే ఏమేం చేయాలి తదితర అంశాలపై డబ్ల్యూఐఐ నివేదిక ఇస్తుంది. అదేవిధంగా కారిడార్ నిర్మాణానికి జాతీయ వన్యప్రాణుల బోర్డు నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం డబ్ల్యూఐఐ నివేదిక ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ అధ్యయనం ఓ కొలిక్కివస్తే ఎలివేటెడ్ వంతెన నిర్మాణంపై త్వరగా ముందడుగు పడే అవకాశం ఉందని ఎన్‌హెచ్ అధికారులు చెబుతున్నారు. అలాగే ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఇటు ఏపీలో దోర్నాల వైపు నుంచి, అటు హైదరాబాద్ వైపు నుంచి శ్రీశైలం క్షేత్రానికి వేగంగా చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాత్రివేళ ఘాట్‌లో రాకపోకలకు అనుమతి లేదు. ఈ ఎలివేటెడ్ వంతెన అందుబాటులోకి వస్తే ఏ సమయంలోనైనా శ్రీశైలానికి వాహనాలు చేరుకొనే వీలు కలుగుతుంది.

# ఆర్సీబీ డబుల్ ధమాకా.. బెంగళూరులో రాత్రంతా రోడ్లపై ఫ్యాన్స్ హంగామా

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయం సాధించగానే బెంగళూరు వీధుల్లో అభిమానుల సంబరాలు అంబరాన్నంటాయి. అయితే, గతేడాది టైటిల్ గెలిచిన సమయంలో జరిగిన ఘోర విషాద ఘటనను దృష్టిలో ఉంచుకుని, ఈసారి బెంగళూరు పోలీసులు పటిష్ఠ బందోబస్త్ ఏర్పాటు చేయడంతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. గతేడాది చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది అభిమానులు మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన పునరావృతం కాకుండా నగర పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. నగరం ప్రధాన ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించి, అభిమానుల సంబరాలు అదుపు తప్పకుండా చూశారు. డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు, వేగ నియంత్రణ కోసం కొన్ని రోడ్లను మూసివేయడం వంటి చర్యలు తీసుకున్నామని బెంగళూరు పోలీస్ కమిషనర్ సీమంత్ కుమార్ తెలిపారు. "ప్రజలు సరైన స్ఫూర్తితో సంబరాలు చేసుకోవాలి. శాంతికి భంగం కలిగించవద్దు" అని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలీసుల పహారా మధ్యలోనే ఫ్యాన్స్ రోడ్లపైకి వచ్చి డ్యాన్సులు చేస్తూ, తమ జట్టు విజయాన్ని, స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ప్రదర్శనను కొనియాడుతూ ఆనందాన్ని పంచుకున్నారు. ఛేజింగ్‌లో కోహ్లీ అజేయ అర్ధ సెంచరీతో రాణించడం వారి ఆనందాన్ని రెట్టింపు చేసింది. ఈ సంతోష సమయంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ గతేడాది మరణించిన అభిమానులను స్మరించుకోవడం అందరినీ కదిలించింది. ఈ విజయం తనకు అద్భుతమైన పుట్టినరోజు కానుక అని పేర్కొన్నాడు. ఆ విషాద ఘటనకు నివాళిగా చిన్నస్వామి స్టేడియంలో 11 శాశ్వత సీట్లను వారి జ్ఞాపకార్థం కేటాయించారు. గతేడాది ఘటన తర్వాత దాదాపు 8 నెలల పాటు చిన్నస్వామి స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్‌లు జరగలేదు. పలు తనిఖీల తర్వాతే బీసీసీఐ మళ్లీ అనుమతులు ఇచ్చింది. భారత్‌లో ఏ వేదికపై ఆడినా తమకు మద్దతు లభిస్తుందని, 'మాకు ఏడు కాదు, 14 హోమ్ గేమ్‌లు' అని విరాట్ కోహ్లీ వ్యాఖ్యానించడం జట్టుకు ఉన్న అశేష అభిమాన గణానికి నిదర్శనం.

# మే నెలలో తిరుమలకు పోటెత్తిన భక్తులు



తిరుమల శ్రీవారి ఆలయానికి మే నెలలో భక్తులు పోటెత్తారు. వేసవి సెలవులు, విద్యాసంస్థలకు విరామం కావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో మే మాసంలో శ్రీవారి దర్శనాలు, హుండీ ఆదాయం, తలనీలాల సమర్పణలో కొత్త రికార్డులు నమోదైనట్లు టీటీడీ తాజాగా గణాంకాలను విడుదల చేసింది. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మే నెలలో మొత్తం 25,46,168 మంది భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, భక్తుల రద్దీ తగ్గలేదు. రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముఖ్యంగా సర్వదర్శనం భక్తులు వేచి ఉండే కంపార్ట్‌మెంట్లలో నిరంతరాయంగా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు అందించి వారికి ఇబ్బంది కలగకుండా చూసింది. స్వామివారిపై తమకున్న భక్తిని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. మే నెలలో శ్రీవారి హుండీ ద్వారా రికార్డు స్థాయిలో రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. ఒకే నెలలో ఈ స్థాయిలో ఆదాయం రావడం తిరుమల చరిత్రలోనే అరుదు. నగదుతో పాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా భక్తులు పెద్దఎత్తున సమర్పించారు. ఇక, మే నెలలో 12,29,773 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com